క్లుప్తంగా

సహాయ చర్యల్లో పాల్గొనండి
-మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు పిలుపు



అవనిగడ్డ: వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పిలుపునిచ్చారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు, ఇతర విధాలా సహాయ పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆపద సమయంలో ప్రజలను ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా వైఎస్సార్ సీపీ నాయకులు పనిచేయాలన్నారు. నాగాయలంక మండలం టి.కొత్తపాలెం, కోడూరు మండలం ఉల్లిపాలెం-హంసలదీవి మధ్య కరకట్ట బలహీనంగా ఉందని ఈ ప్రాంతంలో అధికార యంత్రాంగం చేపట్టే పటిష్ట చర్యల్లో పార్టీ నాయకులు పాలుపంచుకోవాలని సింహాద్రి సూచించారు.

పునరావాస కేంద్రాలకు రండి

కె.కొత్తపాలెం(మోపిదేవి): వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని మూడు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామస్తులను తరలిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య చెప్పారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి భోజన సదుపాయం కల్పించినట్లు వివరించారు. వరద ప్రభావం గల కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ, మోపిదేవి వార్పువద్ద గ్రామాలను సందర్శించారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే గ్రామాలు ఖాళీచేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. మండలి వెంకట్రామ్, ఆయా గ్రామ సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ మాధవి, దొప్పలపూడి గంగాభవానీ, దిడ్ల జానకీ రాం బాబు, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ఎస్‌ఐ సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, పలుశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోతకు గురైన జింకపాలెం రోడ్డు

ఎదురుమొండి దీవి(నాగాయలంక): దీవిలో ఎదురుమొండి నుంచి గొల్లమంద మీదుగా సముద్రతీర గ్రామం జింకపాలెం వెళ్లే ప్రధాన రోడ్డులో ప్రయాణం భయాందోళనలు కలిగిస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈమార్గంలో గొల్లమంద సమీపంలో రోడ్డు కృష్ణానది వరద తాకిడికి గురై కోతపడడంతో ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రహదారిని సంరక్షించి పునర్నిర్మించాలని దీవి వాసులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తే మేలు

కృత్తివెన్ను: ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం వల్ల నాణ్యమైన ఆహారఉత్పత్తులను గడించవచ్చని ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యకర్త కుమారి రైతులకు సూచించారు. ఆదివారం ఆమె యండపల్లి గ్రామంలో సలహాలు అందించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తానంటే వారికి దానికి సంభందించిన పూర్తి వివరాలను తెలియజేసి, సాగువిధానంపై అవగాహన కల్పిస్తామన్నారు. కాయగూరలు, ఆకుకూరల విత్తనాలను అందజేశారు. పిన్నెంటి బాబ్జీ, సుబ్బరాజు, పాండురంగారావు, బిక్షారావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

వలకట్ల తొలగింపు పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

కోడూరు: రత్నకోడు (తాలేరు) ప్రధాన మురుగు డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన అక్రమ వలకట్ల తొలగింపును అధికారులు ప్రారంభించారు. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'కొంపముంచిన అక్రమ వలకట్లు' శీర్షికన ప్రచురించిన కథనంపై డ్రెయినేజీ అధికారులు స్పందించారు. చినగుడుమోటు నుంచి సంగమేశ్వరం వరకు రత్నకోడు డ్రెయిన్‌లో ఉన్న వలకట్ల తొలగింపును కూలీలతో చేపట్టారు. తొలిరోజు పది వలకట్లను తొలగించినట్లు డ్రెయినేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. మిలిగిన వలకట్లను కూడా రెండు రోజుల్లో తొలగిస్తామని చెప్పారు. పొలాల్లో మురుగు దిగువకు పారేందుకు ఏవిధమైన అవరోధాలు లేకుండా డ్రెయినేజీల్లో అడ్డులను తొలగిస్తున్నట్లు డీఈ తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

గూడూరు: ఆర్థిక ఇబ్బందులతో విద్యాభ్యాసం చేస్తున్న కప్పలదొడ్డికి చెందిన విద్యార్థిని దేవి భువనేశ్వరికి మైత్రీ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన భువనేశ్వరి నందమూరులోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఈసీ మూడో సంవత్సరం చదువుతుంది. ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌కు రోజుకు రూ.100 చెప్పున కంపెనీ వారికి చెల్లించాల్సి ఉండగా..మూడు నెలల మొత్తానికి అవసరమైన రూ.9 వేల చెక్కును మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు దైవపు రాధాకృష్ణ, పిచ్చుక నిరంజనరావు అందజేశారు. ఆర్.ప్రసాద్, ఎస్.అనిల్, బసవ, పి.నాగరవి, బూసం లోకనాథరావు, ధనపతి పాల్గొన్నారు.

తొలగని నీరు..తీరని వ్యథ

- ముంపులోనే లోతట్టు ప్రాంతాలు
- పంట పొలాల నుంచి బయటకు పోని నీరు
- ప్రజలకు తప్పని తిప్పలు



పెడన పట్టణంలోని ఓ ఇంటిలో నిలిచిన వర్షం నీటిని ఆయిల్ ఇంజిన్‌తో తోడుతున్న వైనం

పెడన: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో లోతట్టు కాలనీలు, పొలాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. పెడన మండలంలో గత రెండు రోజులుగా 15 సెంటీమీటర్ల చొప్పున వర్షం పడటంతో పట్టణంతో పాటు మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోయినా ఆస్తినష్టం బాగానే జరిగింది. ఆదివారం వర్షం తెరపీయడంతో అక్కడక్కడా అంతర్గత రహదారులలో నిలిచిన వర్షం నీరు కాస్తా డ్రెయిన్లలోకి పోయింది.

అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటన..

అటువంటి ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని తోడించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కమిషనర్ గోపాలరావు పలు కాలనీల్లో పర్యటించారు. తొలుత సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కమిషనర్ పలు లోతట్టు ప్రాంతాలను పర్యటించి నీరు పోయేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కాగిత కాగిత కృష్ణ ప్రసాద్ ఉదయం బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పెడన మండలంలోని పంట పొలాలు సైతం చెరువుల వలే కనిపిస్తున్నాయి. గ్రామాల్లో చెరువులు ఇంకా ముంపులోనే ఉన్నాయి. డ్రెయిన్లలో నీరు బయటకుపోకపోవడం వల్ల పంట పొలాల్లో నీరు అలాగే ఉండిపోయింది. వరినాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెడన పట్టణంలోని రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

చుట్టుముట్టిన వరద నీరు

బంటుమిల్లి: మైనర్ డ్రెయిన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టకపోవడతో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వస్తున వరద నీరు బంటుమిల్లిని చుట్టుముట్టింది. గతంలో ఎన్నడూలేనంతగా రెండు రోజుల్లో 28 సెం.మీ వర్షం నమోదైంది. డ్రెయిన్లు ఆక్రమణకు గురై తూడు, గుర్రపు డెక్క, జమ్ము పొదలతో ఉండి నీటి ప్రవాహానికి ఆటకంగా మారింది. వరద నీరు గ్రామంలో రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో మురుగు నీరు బంటుమిల్లి-మచిలీపట్నం జాతీయ రహదారి, బంటుమిల్లి-గుడివాడ ఆర్అండ్‌బీ రోడ్డు, నాగేశ్వరరావుపేట రోడ్డుపైకి చేరింది.

పనులు అప్పగించినా..

డ్రెయిన్ల మరమ్మతులకు ప్రభుత్వం కాంట్రాక్టరుకు బాధ్యతలు అప్పగించి నెల రోజులు అవుతున్నా నేటి వరకు పనులు మొదలు పెట్టలేదు. దీనిపై గ్రామ సర్పంచ్ వెంట్రప్రగడ కృష్ణవేణి స్పందిస్తూ బంటుమిల్లి చుట్టూ ఉన్న మైనర్ డ్రెయిన్ల సమస్యను డ్రెయినేజీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈరోజు, రేపు అంటూ రెండు రోజులుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై డ్రెయినేజీ ఇన్‌చార్జి ఏఈఈ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టరుతో మాట్లాడి మిషన్‌తోగాని, కూలీలతోగాని వెంటనే డ్రెయిన్ల మరమ్మతు పనులు చేపడతామన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని యండపల్లి, నీలిపూడి, మునిపెడ, అడ్డపర్ర, సంగమూడి తదితర గ్రామాల్లో వర్షం నీరు నిలిచిపోయి చేలు మునిగిపోయాయి. ప్రస్తుతం ఎకరానికి 10 నుంచి 12 వేలు ఖర్చు చేశామని ఇప్పుడు పంటంతా పాడైపోతుందని రైతులు వాపోతున్నారు. ఆక్వా చెరువులు సైతం నీటితో నిండిపోయి గట్లు తెగిపోయే ప్రమాదంలో ఉన్నాయి.

ఎగతట్టిన డ్రెయిన్లు, సముద్రం నీరు

కోడూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వరిపొలాలు నీట మునిగాయి. కోడూరు, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, జరుగువానిపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, జయపురం, కృష్ణాపురం, దింటిమెరక ప్రాంతాల్లో వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లో మురుగు పోయేందుకు దోహదపడే లింగన్నకోడు, రత్నకోడు, న్యూ ఇరాలి క్యాచ్ డ్రెయిన్ల పైకి ఎగతట్టాయి. ఓ వైపు కృష్ణానదిలో భారీగా వరద చేరుతుండగా, సముద్రం పోటు కారణంగా నీరు డ్రెయిన్లలోకి ప్రవహిస్తోంది. నీరు దిగువకు పారే అవకాశం లేకుండా పోవడంతో వరి పైరు మునకబారిన పడింది.



పెందుర్రు మైనర్ డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క

- **పొంగుతున్న గుండేరు, గంజి కాలువ**

ఘంటసాల: ఘంటసాల-చిలకలపూడి ప్రధాన రహదారిపై గంజి కాలువ (భీమనది డ్రెయిన్) ఉధృతంగా ప్రవహిస్తోంది. డ్రెయిన్ గట్టు పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో వందలాది ఎకరాల పంట ముంపునకు గురైంది. ఘంటసాల-చిలకలపూడి, వి.రుద్రవరం వెళ్లే ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తోంది. దేవరకోట గ్రామంలోని చిల్లలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. గంజికాలువ గట్టును తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ సిబ్బందితో కలసి ఆదివారం పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఇరిగేషన్ అధికారులకు కూడా సమాచారం ఇచ్చామని కట్ట బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు.



పెడనలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కమిషనర్

ప్రజలకు తప్పని ఇక్కట్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజవర్గంలో ఆదివారం కూడా వరద ప్రభావం తగ్గలేదు. 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో నగరంతోపాటు గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. నియోజవర్గంలో వరి, వేరుశనగ పొలాలు నీటిలో తేలియాడుతున్నాయి. వందలాది ఎకరాలు ముంపు బారిన పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోని పలు లోతట్టు కాలనీలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కాలనీల్లో ముంపు నీటిని తొలగించేందుకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పారిశుద్ధ్య కార్మికులతో గండ్లు కొట్టించే పనులు చేస్తున్నారు. నగరంలోని ఆదర్శ నగర్, శారద నగర్, దేవుని చెరువు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పర్యటించారు. బాధితులను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో పేర్ని కిట్టు వెంట ఒకటో డివిజన్ కార్పొరేటర్లు జోగి చిరంజీవి, ఎండ్రపాటి నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, గూడవల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.



జలమయమైన సుందరయ్య నగర్

మా ఇంట్లోకి నీరు చేరింది..



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మేము ఉంటున్న ఇంట్లోకి నీరు చేరింది. ఇంట్లో ఉండలేక పిల్లలతో సహా రోడ్డున పడ్డాం. వేరే ఇంటి కోసం వెతుకుతున్నాను. ప్రభుత్వం మా లాంటి వారి కోసం పునరావాసం ఏర్పాటు చేస్తే తలదాచుకునేవాళ్లం. తమను పట్టించుకునే నాయకులు, అధికారులు లేరు.

\- ప్రసాద్, సుందరయ్యనగర్

- **ధాన్యం, పశుసంపద సంరక్షణకు పాట్లు**

అవనిగడ్డ: దివిసీమకు వరద ఉధృతి పెరగడంతో వ్యవసాయ పంటను, పశువులు, కోళ్లను కాపాడుకునేందుకు ముంపు ప్రాంత ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వరద ఉధృతి మరింత పెరగవచ్చనే అధికారుల హెచ్చరికతో దక్షిణ చిరువోలు లంక, ఎడ్లంక, కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, దక్షిణ చిరువోలులంక, పులిగడ్డ, పల్లెపాలెం, రేగుల్లంక గ్రామాలకు చెందిన రైతులు వడ్లపురులు, ఇళ్లలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పశువులు, కోళ్లను బంధువుల ఇళ్లకు తీసుకెళ్లారు. వరద ముంపు గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరితే వస్తువులు పాడయి పోతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కృత్తివెన్ను మండలం అడ్డపర్ర వద్ద నీటిలో మునిగిపోయిన వరిపొలాలు



బంటుమిల్లి-గుడివాడ రోడ్డుపై వరద నీరు



కోడూరులో నీట మునిగిన పొలాలను చూపుతున్న రైతులు

నాగాయలంక చేరిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

నాగాయలంక: ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానది దిగువకు విడుదల చేస్తుండటంతో మండలంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. ఆదివారం తహసీల్దార్ ఎం.హరనాథ్ నేతృత్వంలో ఎస్.ఐ కె.రాజేష్, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు మండలంలోని కృష్ణానదీ పరీవాక ప్రాంతాలను పరిశీలించారు. తొలుత మత్స్యకారుల గృహాలను సందర్శించారు. పునరావాస కేంద్రానికి రావలని చెప్పారు. పడవల నిలుపుదలపై మత్స్యకారులతో చర్చించి, వరద ఉధృతి తగ్గే వరకు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ పూర్తిగా వరదనీరు ప్రవేశించింది. నది అంచున ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి మండపం, కృష్ణమ్మ విగ్రహం సగం మేరకు వరదలో మునిగాయి. వరద సందర్శనకు వచ్చే ప్రజలకు హెచ్చరికలు చేశారు. ముందు జాగ్రత్తగా ఎదురుమొండి-ఏటిమొగ వద్ద పంటు, నదిలో పడవల రాకపోకలను నిషేధించారు. టి.కొత్తపాలెం, ఏటిమొగల వద్ద బలహీన కరకట్ట ప్రాంతాలపై ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్, ఎస్‌ఐ చర్చించి సూచనలు చేశారు. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని నాగాయలంకలో సిద్ధం చేశారు. మరోపక్క శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షపాతం 100.2 మి.మీ నమోదైంది. నాగాయలంక గ్రామంలో రోడ్లపై కూలిన చెట్లు, హోర్డింగ్‌లను గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ పర్యవేక్షణలో తొలగించారు.



నాగాయలంకలో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

దివిసీమకు వరద ముప్పు

నియోజకవర్గంలో 8 పునరావాస కేంద్రాల ఏర్పాటు

అవనిగడ్డ: దివిసీమకు వరద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే వరద నీరు పలు గ్రామాలను ముంచెత్తింది. పాత ఎడ్లంక గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ భూభాగం పెచ్చులు పెచ్చులుగా ఊడి నదిలో కలసి పోతోంది. అవనిగడ్డ నియోజకవర్గంలో పలుచోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

వరద బాధితుల కోసం నియోజకవర్గంలో 8 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అవనిగడ్డ మండలంలో ఎడ్లంక గ్రామస్తులకు గరల్స్ హైస్కూల్, పులిగడ్డ పల్లెపాలెం, వసుమట్ల, పాతకోట, రేగుల్లంక గ్రామస్తులకు అవనిగడ్డ డిగ్రీ కళాశాల, దక్షిణ చిరువోలులంక గ్రామస్తులకు రామచంద్రపురం పాలిటెక్నిక్ కళాశాల పక్కన, మోపిదేవి మండలంలో బొబ్బర్లంక గ్రామస్తులకు కొక్కిలిగడ్డ స్కూల్, కె.కొత్తపాలెం వాసులకు కె.కొత్తపాలెం హైస్కూల్, మోపిదేవి వార్పు ప్రజలకు ఆశ్రమ పాఠశాల, నాగాయలంకలో ఎదురుమొండి దీవుల ప్రజలు, కట్టకింద వాసులకు శ్రీపాద క్షేత్రం వద్ద, కోడూరు మండలంలో విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామస్తులకు చల్లపల్లిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆముదార్లంక గ్రామ ప్రజలు మాత్రం రామని మొరాయిస్తున్నారు. తహసీల్దార్ వనజాక్షి, ఎంపీడీవో చినరాట్నాలు, సీఐ ఈశ్వరరావు, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం గ్రామస్తులను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

కోడూరు మండలం ఉల్లిపాలెం-హంసలదీవి వద్ద పెను ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ నది ఒడ్డు తీవ్రంగా కోతకు గురవుతోంది. ప్రతిసారీ వరదలకు ఇక్కడ ఇదే పరిస్థితి ఉండగా ముందస్తుగా ఇసుక బస్తాలు వేసేవారు. ఈ సారి అలా వేయకుండా ఒడ్డున బస్తాలు వేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వరద ఉధృతి పెరిగితే వేసిన ఇసుక బస్తాలు నదిలో పడిపోవడంతో పాటు ఈ ప్రాంతంలో కోతకు గురై వరద నీరు విరుచుపడే ప్రమాదముందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



ఎడ్లంకలో మాట్లాడుతున్న ఆర్డీవో వాణి

ఎడ్లంకను కోసేస్తున్న వరద..

మండల పరిధిలోని పాత ఎడ్లంకను వరద నీరు కోతకు గురిచేస్తోంది. మండల పరిధిలోని పులిగడ్డ వద్ద అక్విడెక్టుని తాకి వరద నీరు ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగితే అక్విడెక్టుపైగా వెళ్లే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం 18 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. పులిగడ్డ పల్లెపాలెం, రేగుల్లంక, వసుమట్ల, దక్షిణ చిరువోలులంక గ్రామాలకు వరద నీరు చేరింది. మరింత పెరిగితే దక్షిణ చిరువోలులంకకు రాకపోకలు స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

రూ.5.24 కోట్ల పనులు నీటిపాలు

- తూతూ మంత్రంగా డ్రెయిన్ల పనులు
- దివిసీమలో వేలాది ఎకరాలు మునక

అవనిగడ్డ: కోట్లాది రూపాయలతో చేపట్టిన డ్రెయినేజీ పనులు తూతూ మంత్రంగా చేయడం రైతులకు శాపంగా మారింది. ప్రధాన డ్రెయిన్లలో గుర్రపుడెక్కను సరిగా తొలగించక పోవడంతో మురుగు పారక వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. డ్రెయినేజీ పనులకు ఖర్చుచేసిన కోట్లాది రూపాయలు నిధులు నీళ్ల పాలయ్యాయి.

నిధులు ఖర్చు..ఫలితం శూన్యం..

అవనిగడ్డ నియోజకవర్గంలో డ్రెయిన్లు, కాలువల పూడికతీత, మరమ్మతుల కోసం రూ.5.24 కోట్లు మంజూరు చేశారు. పనుల్లో జాప్యం లేకుండా షార్ట్ టెండర్ పద్ధతిలో పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ బాలాజీ పూర్తి స్థాయిలో సహకరించారు. ఇక ముందు ముంపు సమస్య రానీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా తెలిపారు. గత నెలలో ప్రారంభమైన ఈ పనులు ఈనెలలో కూడా చేపట్టారు. మొత్తం 13 డ్రెయిన్ల ప్రక్షాళన కోసం రూ.2.94 కోట్ల విలువైన పనులు చేశారు. వీటితో పాటు రూ.2.30 కోట్ల వ్యయంతో పంట కాలువల పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, ఇరు వైపులా అడ్డుతొలగింపు పనులు చేశారు.



చల్లపల్లిలో బండ్రేవు కోడు వద్ద డ్రెయిన్‌లో గుర్రపుడెక్కను చూపిస్తున్న రైతు

వర్షానికి నీటమునిగిన పొలాలు..

అవనిగడ్డ నియోజకవర్గంలో నాట్లు వేసిన 34 వేల ఎకరాలు నీట మునిగాయి. చల్లపల్లిలోని బండ్రేవు కోడులో గుర్రపు డెక్కను సరిగా తొలగించక పోవడం వల పొలాలు ముంపునకు గురయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

- **రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**

బంటుమిల్లి: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ నాయ కులు డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వేలాది ఎకరాలు వరి పంట నీట మునిగిందని తెలిపారు. డ్రెయిన్లలో పూడికలు తీయకపోవడం, ఆక్రమణలు తొలగించకపోవడం కారణంగానే వరద నీరు పంటలను ముంచడానికి కారణమైందని నాయకులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ, సీపీఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు, జీ గంగాధర్, వై.ప్రసాద్, ఎం.రాంబాబు తదితరులున్నారు.

- **మద్యం సీసాలు స్వాధీనం**

కృత్తివెన్ను: మాట్లాం గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. మాట్లాంలో తిరు మాని నాగరాజు ఇంటి వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతోఆదివారం దాడి చేశామన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నాగరాజును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

- **డ్రెయిన్‌లో వలకట్ల ఏర్పాటుపై నిరసన**

సంగమేశ్వరం(నాగాయలంక): రత్నకోడు డ్రెయిన్‌లో నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న వలకట్లను (చేపలు పట్టేందుకు ఏర్పాటు చేసిన వలకట్లు)తొలగించాని రైతులు కోరారు. ఆదివారం మండలంలోని భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, రైతు నాయకుడు భావిరెడ్డి వెంకటేశ్వరరావునేతృత్వంలో రైతులు సంగమేశ్వరం పరిధిలో నిరత్నకోడు(మేజర్‌డ్రెయిన్) ఔట్‌ఫాల్స్ స్లూయిస్ షట్టర్‌లు తెరిచే ప్రయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో తాళ్లకు కట్టి కర్రలను మాత్రమే తొలగించి డ్రెయిన్ వద్ద అధికారుల వైఖరికి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి డ్రెయిన్లపై వలకట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. వలకట్లు ఏర్పాటు చేయడంతో మురుగు పారుదల స్తంభించిపోతోందని వాపోతున్నారు.

- **ఆర్ఎస్‌కేలో పునరావస కేంద్రం**

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో పురిపాకల్లో నివాసం ఉంటున్న 20 ఎస్టీ కుటుంబాలకు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పునరవాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు కె.పూర్ణచంద్రరావు తెలిపారు. వీరిని ఆర్‌ఎస్‌కే భవనంలో ఉంచి నిత్యావసర వస్తువులను అందజేశామన్నారు.

- **గుర్రపుడెక్క తొలగింపు**

గూడూరు: కుండపోత వర్షానికి మండలంలోని పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. స్థానిక రైతుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరడంతో జేసీబీ ఏర్పాటు చేసి కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే పనులు చేపట్టారు. తహసీల్దారు డి.రాజేశ్వరి గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించి రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆదివారం గ్రామాల్లో పర్యటించిన ఏవో జి.వి.శివప్రసాద్ పంటల రక్షణపై రైతులకు సూచనలు చేశారు.

- **ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి**

అవనిగడ్డ: వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డార ప్రసాద్, నాయకులు పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. డ్రెయినేజీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. వేము రత్నగిరిరావు, అట్టూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ రామారావు, మాలెంపాటి కోటేశ్వరరావు, డొక్కు శ్రీనివాసరావు, తలుపుల సుధాకర్, పాల్గొన్నారు.

- **ముంపు ప్రాంతాల పరిశీలన**

బొబ్బర్లంక(మోపిదేవి): వరద ముంపు ప్రాంతాలను పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీరాజ్ ఈఈ, ఏఈ శ్రీనివాస్‌తో పాటు ఆర్సీ డీఈ భానుబాబు, జెఈలు జనార్ధనరావు, హరీష్, ఇరిగేషన్ అధికారులు రవికిరణ్, ఏఈ పి.వెంకటేశ్వరావు లంకగ్రామాలను పరిశీలించారు. ముందస్తుగా అయోధ్య, ఉత్తరచిరువోలు లంక కరకట్ట వద్ద లాక్‌లను మూసివేసిన ఇరిగేషన్ శాఖ అధికారులు లాక్‌లకు అడ్డుగా ఇసుకమూటలు వేశారు. మోపిదేవివార్పు అక్విడెక్టు వద్ద కృష్ణానదిలో పొంగిపొర్లుతున్న వరద నీటిని చూసేందుకు ప్రజలు తిలకించారు.

- **మూడు గ్రామాల్లో అప్రమత్తం**

శ్రీకాకుళం(ఘంటసాల) : వరద ఉధృతి పరిస్థితిని ఎదుర్కోవడానికి మండలంలో సర్వం సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నా రు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల్లో ఆదివారం తహసీల్దార్ పర్యటించారు. శ్రీకా కుళం జెడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ముప్పనేని రవి ప్రసాద్, కుంపటి అనిత, కుంపటి సుశీల, డీటీ చప్పిడి చిట్టిబాబు పాల్గొన్నారు.

- **పొంగి పొర్లుతున్న కృష్ణమ్మ**

మోపిదేవి: మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదిలో చేరిన వరద నీరు అక్విడెక్టు మీదగా సముద్రం వైపు పరుగులు పెడుతోంది. మండలంలోని కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు వద్ద వరదనీరు పైకి వచ్చి పంట పొలాలను ముంచెత్తుతోంది. ఇరిగేషన్ డీఈ రవి కిరణ్ మాట్లాడుతూ అక్విడెక్టు వద్ద వరదనీటిని పరిశీలిస్తున్నారు. సుమారు 8 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- **భోజనం ప్యాకెట్ల పంపిణీ**

కోడూరు: కృష్ణానది వెంట నివసించే పలు కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉల్లిపాలెం సమీపంలో కరకట్ట వెంట ఉంటున్న 21 మంది ఎస్టీ కుటుంబాలకు, విశ్వనాథపల్లిలో నది సమీపంలో నివాసముంటున్న మరో 21 మందికి పునరావాసం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాలలో వసతులు సమకూర్చారు. తహసీల్దార్ శ్రీనునాయక్, ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, పర్యవేక్షించారు.

- **గర్భాలయం జలమయం**

నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి గర్భాలయం వర్షాలకు తరచూ మునగడంతో భక్తులు తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. భారీ వర్షంతో మరోసారి గర్భ గుడిలోకి భారీగా నీరు ప్రవేశించాయి. వర్షం పడినప్పుడల్లా ఆయిల్ ఇంజిన్‌తో నీటిని బయటకు తోడించాల్సి వస్తుంది. ఆదివారం గర్భాలయంలో ఉన్న నీటిలోనే మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజ జరిపారు.